# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 05-10-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు స్వదేశీ ఉత్పత్తులను మాత్రమే ఉపయోగించాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కోరారు.

- పశ్చిమ బెంగాల్ లోని డార్జిలింగ్ లో భారీ వర్షాల కారణంగా పలువురు మృతి చెందడం పట్ల రాష్ట్రపతి, ప్రధానమంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

- భారత్ - పాకిస్థాన్ మహిళా జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ లో భారత్ పాకిస్థాన్‌కు 248 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

- ఈశాన్య భారతదేశంలోని పలు రాష్ట్రాలలో రానున్న 24 గంటలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు స్వదేశీ ఉత్పత్తులను మాత్రమే ఉపయోగించాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా విజ్ఞప్తి చేశారు. మహారాష్ట్రలోని అహల్యానగర్ జిల్లాలో పద్మశ్రీ డాక్టర్ విఠల్‌రావ్ విఖే పాటిల్, పద్మభూషణ్ డాక్టర్ బాలాసాహెబ్ విఠల్ రావ్ విఖే పాటిల్ విగ్రహాలను ఆయన ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ... 140 కోట్ల జనాభా కలిగిన భారతదేశం విస్తారమైన మార్కెట్‌ను సూచిస్తుందని, పౌరులు సమిష్టిగా స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం వలన దేశ ఆర్థిక వృద్ధి వేగవంతం అవుతుందన్నారు. భారతదేశం ఇప్పటికే ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడానికి దగ్గరగా ఉందని, ప్రపంచ వ్యాప్తంగా అగ్రస్థానాన్ని సాధించాలంటే స్వదేశీ ఉత్పత్తుల పట్ల బలమైన నిబద్ధత అవసరమని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారీ వర్షాల కారణంగా పశ్చిమ బెంగాల్ లోని డార్జిలింగ్ లోని పలు ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడిన ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఘటనా స్థలాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మరో వైపు సిలుగుడి-మరిక్

ప్రాంతాలను కలిపే బాలసోన్ నదిపై ఉన్న వంతెన కూలిపోయింది. ఈ ఘటనల్లో మృతి చెందినవారి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డార్జిలింగ్‌లో భారీ వర్షాల కారణంగా ప్రాణనష్టం జరగడం ఎంతో బాధాకరమని రాష్ట్రపతి సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఘటనలపై ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ విచారం వ్యక్తం చేస్తూ.. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ప్రాణాలు కోల్పోయిన వారి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారికి మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని అధికారులకు సూచించారు. భారీ వర్షాల దృష్ట్యా డార్జిలింగ్ ప్రాంతంలోని పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని ప్రధానమంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (SIR)ను ఓటర్లు, రాజకీయ పార్టీలతో సహా అందరూ ప్రశంసించారని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అన్నారు. పాట్నాలో ఈరోజు జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... SIR చట్టబద్ధంగా, నిబంధనల ప్రకారం చేపట్టబడిందన్నారు. దీనిని విజయవంతంగా పూర్తి చేయడంలో బూత్ లెవెల్ ఆఫీసర్ల నిబద్ధత, అంకితభావం ప్రశంసనీయమని పేర్కొన్నారు. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా, ప్రశాంతంగా నిర్వహించడానికి 17 కొత్త కార్యక్రమాలను ప్రారంభించామని జ్ఞానేష్ కుమార్ వెల్లడిస్తూ...

(వాయిస్ 36 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ ఈ నెల 8, 9వ తేదీల్లో భారత్‌లో పర్యటించనున్నారు. 9వ తేదీన ముంబైలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఆయన సమావేశమవుతారు. విజన్–2035 రోడ్ మ్యాప్‌లో భాగంగా భారత్, యూకే మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి చేపట్టిన చర్యల పురోగతిని వారు సమీక్షిస్తారు. వాణిజ్యం, పెట్టుబడి, సాంకేతికతలు, ఆవిష్కరణ, రక్షణ, భద్రత, వాతావరణం, శక్తి, ఆరోగ్యం, విద్య, ప్రజా సంబంధాలు వంటి కీలక అంశాలపై చర్చిస్తారు. అలాగే ముంబైలో జరిగే గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో ఇరు దేశాల ప్రధానులు ప్రసంగిస్తారు. కీర్ స్టార్మర్ గత ఏడాది జులైలో యూకే ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత భారత్‌లో పర్యటించడం ఇదే మొదటి సారి.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశపు రెండవ యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్ “యాన్డ్రోత్” (Androth) యుద్ధ నౌక రేపు విశాఖపట్నం వేదికగా నావికాదళంలోకి ప్రవేశించనుంది. ఈ కార్యక్రమానికి ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్, వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ అధ్యక్షత వహిస్తారు. యాన్డ్రోత్ రాకతో భారత నావికాదళం సామర్థ్యం పెరుగుతుందని స్వావలంభన వైపు స్థిరమైన అడుగులో ఇది మరో మైలురాయి అని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. యాన్డ్రోత్ ప్రవేశంతో నేవీ యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్ సామర్థ్యాలు గణనీయంగా పెరుగుతాయని, ముఖ్యంగా సముద్ర జలాల్లో ప్రమాదాలను ఎదుర్కోవడంలో ఇది దోహదపడుతుందని పేర్కొంది. కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ (GRSE) దాదాపు 80 శాతం కంటే ఎక్కువ స్వదేశీ సాంకేతికతతో నిర్మించిన ఈ యుద్ధ నౌక పెరుగుతున్న భారతదేశపు సముద్రయాన స్వావలంబనకు నిదర్శనంగా నిలుస్తుందని రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బార్బడోస్ లోని బ్రిడ్జ్ టౌన్ వేదికగా 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ (సీపీసీ) ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు జరగనుంది. ఈ కాన్ఫరెన్స్ లో భారత పార్లమెంటరీ బృందానికి లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా నాయకత్వం వహిస్తారు. కామన్వెల్త్ దేశాలలోని చట్ట సభల సభాపతులు తమ తమ అనుభవాలను, ఆలోచనలను ఈ వేదికగా పంచుకుంటారు. ప్రజాస్వామ్యానికి మద్దతుగా పార్లమెంట్లను బలోపేతం చేయడం అనే అంశంపై "కామన్వెల్త్, ఎ గ్లోబల్ పార్టనర్" ఇతివృత్తంతో ఈ ఏడాది సీపీసీ ని నిర్వహిస్తున్నారు. ఇక ఈ సదస్సుకి రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ తో పాటూ 37 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్స్, 24 రాష్ట్రాల కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 16 మంది చట్ట సభల కార్యదర్శులు హాజరుకానున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా శ్రీలంకలోని కొలంబో వేదికగా భారత్ - పాకిస్థాన్ మహిళల జట్ల మధ్య జరుగుతున్న వన్డే క్రికెట్ మ్యాచ్ లో భారత్ 50 ఓవర్లలో 247 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన పాకిస్థాన్ 11 ఓవర్లు పూర్తయ్యే సరికి 2 వికెట్ల నష్టానికి 26 పరులుగు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్, సిక్కిం, మేఘాలయ రాష్ట్రాలలో రానున్న 24 గంటలలో పలు ప్రాంతాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. అలాగే ఈరోజు, రేపు వాయువ్య భారతదేశంలో కొన్ని ప్రాంతాలలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాస్త్రవేత్త ఉమా శంకర్ దాస్ వివరిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖా మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమానికి హాజరయ్యారు. దీనిలో భాగంగా మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియం నుండి ఇండియా గేట్ వరకు జరిగిన సైక్లింగ్ ర్యాలీలో వంద లాది మంది ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా 10,500 కి పైగా వేర్వేరు ప్రదేశాలలో ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్ నిర్వహించామని, అనేక మంది ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. ప్రతి ఆదివారం లక్షలాది మంది తమను తాము ఫిట్‌గా ఉంచుకోవడానికి సైకిలింగ్ లో పాల్గొని స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని మన్సుఖ్ మాండవీయ వ్యాఖ్యానించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =